హామీలు అమలు కావడం లేదని మక్తల్‌లో ఎమ్మెల్యే శ్రీహరిని నిలదీస్తున్న మహిళలు

బస్సులే ఆపనప్పుడు ఉచితం ఎందుకు?

- పేరుకే ఫ్రీ బస్ పెట్టారు
- పెంచిన పింఛన్ లేదు.. పాతదీ సక్కగ ఇస్తలేరు
- ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

మక్తల్, డిసెంబర్ 3 : 'కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంలోని ఫ్రీ బస్సు పేరుకే .. మహిళల పట్ల ఆర్టీసీ ఉద్యోగులు చిన్నచూపు చూస్తున్నారు.. మహిళలను చూస్తేనే రోడ్డుపై, స్టేజీల వద్ద బస్సులు ఆపకుండా వెళ్తున్నారు.. అసలు ఫ్రీ బస్సు ఏ ఉద్దేశంతో.. ఎవరి కోసం పెట్టారు'.. అంటూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మహిళలు నిలదీశారు. మంగళవారం నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన అర్బన్‌డే కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు చేదు అనుభవం ఎదురైంది. ఫ్రీ బస్సు ప్రారంభించి మహిళలకు జీరో టికెట్ అందించి వారి చార్జీలను ప్రభుత్వమే భరిస్తున్నదని ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. పలువురు మహిళలు ఒక్కసారిగా గొంతెత్తారు. అలాగే పెంచిన పింఛన్ రూ.4 వేలు ఇవ్వడం లేదు .. పాత పింఛన్ కూడా సక్రమంగా అందించడం లేదని వాపోయారు. ఎమ్మెల్యే వద్దకు వెళ్లకుండా మహిళా కానిస్టేబుళ్లు, పోలీసులు మహిళలను అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించారు.

తులం బంగారం ఏది?

ఎమ్మెల్యే వివేక్‌పై మహిళల ఆగ్రహం

భీమారం, డిసెంబర్ 3 : 'కల్యాణ లక్ష్మి పథకం కింద రూ. లక్ష చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తమని చెప్పి ఓట్లు వేయించుకుంటిరి. అధికారంలోకి రాంగనే మాట తప్పితిరి.. ఇదెక్కడి న్యాయం. తులం బంగారం అయినా ఇవ్వండి.. లేదంటే రూ. 90 వేల నగదైనా ఇవ్వండి.'' అంటూ మంగళవారం మంచిర్యాల జిల్లా భీమారంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను మహిళలు నిలదీశారు. స్థానిక రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తుండగా, తులం బంగారం ఎప్పుడిస్తరు అని మహిళలు వివేక్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఆయన జనవరి నుంచి తులం బంగారం వస్తుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లే ప్రయత్నం చేయగా.. అడ్డుకున్నారు. మాయమాటలు చెప్పి మాతో ఓట్లు వేయించుకొని అన్యాయం చేశారని మండిపడ్డారు.



మంచిర్యాల జిల్లా భీమారంలో ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీస్తున్న యువకులు, గ్రామస్థులు

కోతుల బెడద నుంచి కాపాడాలి

భీమారంలో కోతుల బెడదను నివారించాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను గ్రామీణ చైతన్య సేవ సమితి సభ్యులు నిలదీశారు. ప్రజాఫిర్యాదు విభాగంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు వివేక్ స్పందిస్తూ రాష్ట్రమంతటా కోతుల బెడద ఉందని.. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో మీరే చెప్పాలని ఎదురు ప్రశ్నించారు. ఖర్చులు తాము భరిస్తామని చెబుతుండగానే.. వివేక్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. యువకులు మాట్లాడుతూ స్థానిక ఎలెక్షన్లప్పుడు తమ కాలనీకి వస్తే తరుముతామని హెచ్చరించారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు ఎప్పుడిస్తారని ఎమ్మెల్యే కశిరెడ్డిని నిలదీస్తున్న లబ్ధిదారులు

'డబుల్' ఇండ్లు ఎప్పుడిస్తరు?

ఎమ్మెల్యే కశిరెడ్డిని నిలదీసిన లబ్ధిదారులు

కల్వకుర్తి, డిసెంబర్ 3 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు ఎప్పుడిస్తారని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని లబ్ధిదారులు నిలదీశారు. మంగళవారం ప్రజాపాలన సంబురాల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయానికి ఎమ్మెల్యే రాగా.. డబుల్ ఇండ్ల లబ్ధిదారులు, కాలనీవాసులు వచ్చి కలిశారు. కల్వకుర్తిలో 99 సర్వే నంబర్‌లో 240 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందని, ఈ ఇండ్లను ఎప్పుడు అప్పగిస్తారని ఎమ్మెల్యేను నిలదీశారు. ఎమ్మెల్యే కల్పించుకొని చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయని, పూర్తికాగానే అప్పగిస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగా.. కొందరు కాంగ్రెస్ నాయకులు కల్పించుకొని లబ్ధిదారులతో వాగ్వాదానికి దిగారు. ఈ నెల 30 వరకు ఇండ్లు అప్పగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

50 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

ఓఆర్ఆర్‌కు అనుబంధంగా ముచ్చర్లలో నగరం

- టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడేలా నిర్మిస్తాం
- 35 వేల కోట్లతో ఆర్ఆర్ఆర్ కోసం ప్రయత్నం
- హైదరాబాద్ అభివృద్ధిపై మంత్రివర్గ ఉపసంఘం
- హైడ్రా కూల్చుతున్నది అక్రమ నిర్మాణాలే
- లక్షన్నర కోట్లతో మూసీ పునరుజ్జీవం: సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): 50 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్‌కు అనుబంధంగా ముచ్చర్లలో నిర్మిస్తామని చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో సీఎం మాట్లాడారు. రూ.35వేల కోట్లతో 360 కిలోమీటర్ల పొడవున ఆర్ఆర్ఆర్‌ను నిర్మించనున్నామని తెలిపారు. రీజినల్ రింగురోడ్డుకు అనుబంధంగానే ముచ్చర్లలో 40 నుంచి 50 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. ముచ్చర్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తే హైదరాబాద్ కూడా టోక్యో, న్యూయార్క్‌లాగా మారుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు 7వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మూసీ పునరుజ్జీవనానికి లక్షన్నర కోట్లు అవసరమని అన్నారు. ఏడాదిలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 % పెరిగిందని అన్నారు. నగరంలో నీటిని నిల్వ చేసేందుకు 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ హార్వెస్టింగ్ బావులను నిర్మిస్తున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నంలో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు.

హైడ్రా కూల్చివేతలు ఆపేదిలేదు

అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూలుస్తున్నదని, హైదరాబాద్‌లో నిర్మాణాల కూల్చివేతలను ముమ్ముందు కూడా కొనసాగిస్తామని సీఎం స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై వెనక్కి తగ్గబోమని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కేంద్రం నుంచి లక్షన్నర కోట్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ ఉపసంఘానికి ప్రతిపక్షాలు ప్రతిపాదనలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం పరిధిలోని అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్‌లకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆర్బీఐ నుంచి 2 వేల కోట్ల అప్పు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఆర్బీఐ వద్ద రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో రూ.2 వేల కోట్లు అప్పుగా తీసుకున్నది. వెయ్యి కోట్ల విలువైన రెండు బాండ్లను వేర్వేరుగా 20 ఏండ్లు, 21 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. వీటిని వేలం వేసిన ఆర్బీఐ.. ఆ మొత్తాన్ని రాష్ట్ర ఖజానాకు చేరవేసింది. దీంతో ఆర్బీఐ వద్ద తీసుకున్న మొత్తం అప్పు రూ.72,118 కోట్లకు చేరింది. ఇవి కాకుండా ఈ నెలలోనే అదనంగా మరో రూ.10,000 కోట్లు రుణం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అనుమతి కోరింది. నేరుగా ఆర్బీఐ నుంచి సేకరించే రుణాలు సరిపోక.. కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు కూడా గ్యారెంటీలు ఇస్తున్నది.

'మార్పు' పేరుతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ ప్రజలకు తనదైన 'మార్క్' చూపించింది. ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పు తీసుకురావడం మరచి, స్వార్థపూరిత పాలనకు తెరతీసిందనే విమర్శలు ఎదుర్కొంటున్నది. హామీలు అమలు కాకపోగా స్కాములకు తెరతీసిందనే ఆరోపణలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. కాదేదీ అనర్హం అన్నట్టుగా బూడిద నుంచి భూముల వరకు అన్నింటిలోనూ కాంగ్రెస్ తన పనితనం చూపిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమాలతో మొదలైన హస్తం పార్టీ పాలనలో నెలకో వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇందులో చాలా కుంభకోణాల తీగలు లాగితే చివరికి 'బిగ్ బ్రదర్స్' డొంకలు కదలడం చూస్తే కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

-హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)

కుంభకోణాలకు కేరాఫ్ కాంగ్రెస్

ఏడాది పాలనలో అడుగడుగునా ఆరోపణలు

- బూడిద, బియ్యం, భూములు.. అన్నింటా అక్రమాలు?
- రియల్ ఎస్టేట్‌ను దెబ్బ కొట్టిన 'ఫిక్స్‌డ్' వసూళ్లు
- కస్టమ్స్, ఈడీ వరకు చేరిన గడియారాల స్మగ్లింగ్

ఏడాదిలో కుంభకోణాల ఆరోపణలు

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని సర్వే నెంబరు 92లో ఉన్న అసైన్డ్ భూములకు పాస్ పుస్తకాలతోపాటు ఎన్‌వోసీలు తెచ్చుకుంటామంటూ రైతులతో కొందరు ఒప్పందాలు చేసుకున్నారు. ఎకరాకు రూ.10లక్షల నగదుతోపాటు అభివృద్ధి చేసిన భూమిలో ఎకరాకు వెయ్యి గజాల చొప్పున జాగా ఇస్తామని రైతులతో ఒప్పందాలు చేసుకున్నారు. బిగ్ బ్రదర్స్ సమీప బంధువుకు చెందిన కంపెనీ పేరుతో ఏజీపీఏ చేయాలని చెప్పారు. రూ.2వేల కోట్లకుపైగా విలువైన భూములను కొట్టేసేందుకు ప్రయత్నించారు.

రామగుండం ఎన్టీపీసీ నుంచి ఖమ్మంకు ఫ్లైయాష్ తరలింపులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. నిబంధనల ప్రకారం ఒక్కో లారీలో 32 టన్నుల ఫ్లైయాష్‌తో రోజుకు 300 లారీల్లో తరలించాల్సి ఉంటుంది. కానీ రెట్టింపు స్థాయిలో 50-65టన్నుల వరకు ఓవర్‌లోడ్‌తో రవాణా జరిగినట్టు తెలుస్తున్నది. ఓవర్‌లోడ్‌తో ఒక్కో ట్రిప్పులో రూ.25వేల వరకు మిగిలినట్టు చెప్పారు. రోజుకు రూ. 50 లక్షల చొప్పున దాదాపు రూ. 100కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు గండిపడిందని, అంతా ఓ మంత్రి జేబులోకి వెళ్లిందని ఆరోపణలు వచ్చాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొత్త పాలసీ పేరుతో ఇసుక సరఫరాను నిలిపివేసింది. ఇదే సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉన్న రీచ్‌ల నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ దందా సాగింది. ఈ దందా వెనుక ఓ మంత్రి పీఏతోపాటు ఉత్తర తెలంగాణలోని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి.

సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా రాష్ట్రంలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేలా స్విచ్‌బయోతో ఒప్పందం చేసుకున్నారు. ఈ కంపెనీలో సీఎం సోదరుడు అనుముల జగదీశ్వర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. అప్పటికి నాలుగు నెలల కిందటే కంపెనీ రిజిస్టర్ అయింది. షేర్ క్యాపిటల్ రూ.10లక్షలు మాత్రమే ఉన్న కంపెనీ ఏకంగా రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టడం ఎలా సాధ్యమనే విమర్శలు వచ్చాయి.

తెలంగాణ ప్రభుత్వం కొత్త లిక్కర్ బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకు కొన్ని కంపెనీలకు అనుమతులు జారీ చేసింది. ప్రజాదరణ పొందిన బ్రాండ్లను కనిపించకుండా చేసి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం ద్వారా ఏటా రూ.5వేల కోట్ల వరకు కమీషన్లు చేతులు మారేలా ప్లాన్ వేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రికి తెలియకుండానే ఎవరో 'పెద్దలు' ఈ దోపిడీకి తెరతీశారని ఆరోపణలు వచ్చాయి.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖరీదైన వాచీల అక్రమ రవాణా కేసులో ఇరుక్కున్నారు. చెన్నై విమానాశ్రమంలో ఈ ఫిబ్రవరి 5న కస్టమ్స్ అధికారులు రెండు లగ్జరీ వాచీలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ముబీన్ అనే వ్యక్తి హాంకాంగ్ నుంచి భారత్‌లోకి స్మగ్లింగ్ చేస్తున్నట్టు గుర్తించారు. విచారణలో మంత్రి పొంగులేటి కొడుకు కోసమే తెచ్చినట్టు చెప్పారు. దీంతో కస్టమ్స్ అధికారులు మంత్రి కొడుకును విచారించారు. ఈ స్మగ్లింగ్ రాకెట్ రూ.100కోట్లకుపైగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంటును మార్చారు. రీజినల్ రింగురోడ్డు దక్షిణ భాగాన్ని 189కిలోమీటర్ల నుంచి 194కిలోమీటర్లకు పెంచారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో మాడ్గుల, మన్నెగూడ, అమన్‌గల్, కడ్తాల్ ప్రాంతాల్లో ప్రభుత్వ పెద్దల సన్నిహితుల భూములకు ధరలు పెరిగేలా ఈ మార్పులు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

పౌరసరఫరాల శాఖ గోదాముల్లో నిల్వ ఉన్న 35 లక్షల టన్నుల బియ్యం ఖాళీ చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. క్వింటాలు రూ. 2,007కు కోట్ చేస్తే మిల్లర్ల నుంచి రూ.2,223 వసూలు చేశారని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపించాయి. రూ. 220 చొప్పున మొత్తం రూ.750 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించాయి. ఇక గురుకులాలు, అంగన్‌వాడీలు, మధ్యహ్న భోజన పథకానికి 2.20 లక్షల టన్నుల సన్నబియ్యం సరఫరా కిలో రూ.57 చొప్పున టెండర్లు ఖరారు చేశారు. బహిరంగ మార్కెట్లో రూ. 42-45 మధ్య దొరుకుతున్నదని, అదనంగా రూ.15 చొప్పున 2.20 లక్షల టన్నులకు రూ.330 కోట్లు అదనంగా చెల్లిస్తున్నారని విపక్షాల నేతలు ఆరోపించారు. రెండూ కలిపి రూ.1100 కోట్లు.

ప్రభుత్వం రూ.1.5లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మూసీ పునర్జీవం పెద్ద కుంభకోణం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనాథ పిల్లల కోసం నిజాంల కాలంలో సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విక్టోరియా హోమ్‌లో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. బ్రిటన్ మహారాణి క్వీన్ విక్టోరియా పేరుతో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ ఏర్పాటు చేసిన ఈ హోమ్‌లో విలువైన సామాగ్రిని నిర్వాహకులు స్వాహా చేశారనే ఆరోపణలు వచ్చాయి.

ఫార్మాసిటీని రద్దుచేసి వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నించడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం అల్లుడి ఫార్మా పరిశ్రమ అక్కడ ఏర్పాటు కానున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలన్నా, లేఔట్లు అనుమతులు ఇవ్వాలన్నా ఆర్ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. బిల్డర్ల నుంచి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంస్థల నుంచి చదరపు అడుగుకు, చదరపు గజానికి వసూలు చేస్తున్నారని రియర్ వ్యాపారవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

అమృత్ 2.0 టెండర్లలో ఎలాంటి అర్హత లేకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి చెందిన శోధా కంపెనీకి టెండర్లను కట్టబెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేవలం రూ.2 కోట్ల లాభాల్లో ఉన్న కంపెనీ రూ.800 కోట్ల టెండర్లు ఎలా చేస్తుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బావమరిదికి అప్పనంగా రూ.1,137 కోట్ల టెండర్లు కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా మార్పు నినాదంతోఅధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనకు మార్కులు వేయాలంటే తనదైన మార్కు చూపించుకుంటున్న కాంగ్రెస్ పాలనకు అవినీతి రిమార్కులే వేయాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు.



రేవంతన్నా.. గొప్పలెందుకన్నా?

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు ఇవ్వు
- రేషన్‌కార్డులిస్తే అదే పండుగ
- సీఎం సభలో ఓ మహిళ నిరసన

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సచివాలయానికి కూతవేటు దూరంలో ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డికి చుక్కెదురైంది..ఆయన ప్రసంగిస్తున్న సమయంలో నవనీత అనే మహిళ ధిక్కార స్వరం వినిపించింది. అన్నా అంటూ సంబోధిస్తూనే సంక్షేమ పథకాలపై ప్రశ్నించింది. గొప్పలు చెప్పుకోవడం కాదని ఇచ్చిన మాట మేరకు పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని నిలదీసింది. అప్పుడే ఇంతకంటే పెద్ద పండుగ చేసుకుందామని తేల్చిచెప్పింది. ఆమె మాటల్లోనే.. 'అన్నా రేవంత్ అన్నా.. ఇయ్యాల వికలాంగుల దినోత్సవం. గొప్పలు చెప్పుకోవడం ఎందుకన్న? నీకు చేతులెత్తి మొక్కుతున్న. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వండి. అవసరమున్నోళ్లకు రేషన్ కార్డులివ్వండి. ఇదొక్కటే కోరుకుంటున్నం. జర నీకు పుణ్యముంటది. అప్పుడు ఈ ఏడాది పండుగకంటే మించి లక్షల మందితో సభ పెట్టుకుందాం' అని చెప్పింది. ఆమె మాటలు విన్న అక్కడివారు ఆ మహిళను మెచ్చుకోవడం కనిపించింది. అయితే, నవనీత మాటలను సీఎం విననట్టుగానే వెళ్లిపోయారు.

ఏం చేశారని విజయోత్సవాలు?

- హామీలను పరిష్కరించారా?
- గ్యారంటీల అమలులో విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా విజయోత్సవాలు నిర్వహించడం ఏమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు.

పారిశ్రామిక అనుమతుల్లో ద్వంద్వ వైఖరి

- సామాన్యులకు అనుమతులు ఇవ్వని అధికారులు
- సొంత జాగాల్లో పరిశ్రమలు పెట్టేవారికి తిప్పలు
- అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు మాత్రం ఆగమేఘాల మీద ప్రజాభిప్రాయ సేకరణ

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంలో అధికారులు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. బడా పారిశ్రామికవేత్తకు ఎర్ర తివాచీ పరుస్తూ, చిన్నతరహా పారిశ్రామికవేత్తలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా సొంత జాగాల్లో చిన్నతరహా యూనిట్ల ఏర్పాటుకు సైతం అనుమతులు ఇవ్వడంలేదు. సీఎం కార్యాలయం నుంచి అనుమతి రావాలంటూ జాప్యం చేస్తున్నారు. దీంతో అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సీఎం వద్దకు వెళ్లలేక, అనుమతులు లభించక నానా అవస్థలు పడుతున్నారు. పారిశ్రామిక అనుమతుల మంజూరుకు సీఎం ఆఫీసుతో సంబంధం ఏమిటో అంతుబట్టడం లేదని, తమది ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న పాలకులు ఇలా వ్యవహరించడం ఏమిటని మండిపడుతున్నారు. టీజీఐఐసీ వద్ద భూములు కొనుగోలు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారికి టీఎస్-ఐపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో అన్నిరకాల అనుమతులు మంజూరవుతాయి. కానీ, సొంత జాగాలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారు రెవెన్యూ, హెచ్ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ విభాగాల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అనంతరం పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకుంటే అన్ని ధృవపత్రాలను పరిశీలించి తుది అనుమతులు జారీచేస్తారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

సీఎంవో నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తేనే..

ప్రస్తుతం టీజీఐఐసీ ద్వారా జరిగే భూకేటాయింపులను ఒకరిద్దరు అధికారులతోపాటు కొందరు బయటి వ్యక్తులు నియంత్రిస్తున్నారు. మరోవైపు సొంత జాగాల్లో పరిశ్రమలు పెట్టుకునేవారి దరఖాస్తులు హెచ్ఎండీఏ వద్ద ఆగిపోతున్నాయి. కనీసం ఆ దరఖాస్తుల పురోగతి ఏమిటో, అవి ఎక్కడ చిక్కుకున్నాయో తెలుసుకునేందుకు కూడా వీల్లేకుండా పోయింది. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. అన్నీ ఫైళ్లను సీఎం కార్యాలయానికి పంపామని, అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తేనే అనుమతులు జారీచేస్తామని సెలవిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు దరఖాస్తుదారులు సచివాలయంలో సీఎం కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించినా సెక్యూరిటీ సిబ్బంది అనుమతించడంలేదు.

పెద్దలకు మాత్రం వెంటనే అనుమతులు

కొందరు బడా పారిశ్రామికవేత్తలకు మాత్రం ప్రభుత్వం ఆగమేఘాల మీద అనుమతులు ఇస్తున్నది. ఇటీవల నల్లగొండ జిల్లా రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అదానీ సంస్థ నుంచి దరఖాస్తు రాగానే ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీచేయడమే ఇందుకు తాజా నిదర్శనం. అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వెనక్కి తగ్గని రేవంత్‌రెడ్డి సర్కారు.. చిన్నతరహా పారిశ్రామికవేత్తలను మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. తమది ప్రజాప్రభుత్వమని, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామని పదేపదే చెప్తున్న రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ పెద్దలు చిన్నతరహా పారిశ్రామికవేత్తలను ఎందుకు వేధిస్తున్నారో అంతుబట్టడం లేదు.

'ప్రజాపాలన' ఫెయిల్

- ఎమ్మెల్యేల ఫోనే ఎత్తని మంత్రులుంటే ఎలా?
- 144 సెక్షన్, అరెస్టులు ప్రజాస్వామ్యానికి విఘాతం
- మావోయిస్టుల ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే
- కాంగ్రెస్ పార్టీ మిత్రధర్మం పాటించి పదవులివ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రజాపాలన కార్యక్రమం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సమస్యలను తెలుసుకునేందుకు మంత్రులు, ప్రభుత్వాధికారులు మరింతగా ప్రజలతో మమేకమవ్వాలని డిమాండ్ చేశారు. ఒక ఎమ్మెల్యే ఫోన్ చేస్తే కూడా స్పందించని స్థితిలో మంత్రులు ఉన్నారని, అధికారులు కూడా అదేరీతిన ఉన్నారని విమర్శించారు. హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, బాలనర్సింహతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.. రాష్ట్రంలో జరుగుతున్న మావోయిస్టు ఎన్‌కౌంటర్లు తెలంగాణ ప్రభుత్వానికి తెలిసి జరుగుతున్నాయా? తెలియక జరుగుతున్నాయనా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు